బ్లాక్‌లో గ్యాస్ సిలిండర్లు

● డెలివరీ అయిందని మెసేజ్ వచ్చినా గ్యాస్ రాదు ● పట్టించుకోని పౌరసరఫరాల శాఖ అధికారులు



గ్యాస్ సిలిండర్లను తరలిస్తున్న ఆటో



ఖైరతాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో నిత్యావసర వస్తువుగా వినియోగించే గ్యాస్ సిలిండర్లకు ఉన్న డిమాండ్‌ను ఆసరాగా తీసుకొని వాటిని బ్లాక్‌లలో విక్రయిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. డెలివరీ బాయిస్, కార్యాలయ సిబ్బంది వినియోగదారులకు సరైన సమయానికి గ్యాస్ సిలిండర్లు అందించకుండా డబ్బులు ఎక్కువ ఇచ్చే వారికి, బ్లాక్ వ్యాపారం చేసే వారికి, అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేసేవారికి, వాణిజ్య అవసరాలకు ఇళ్లలో వాడే సిలిండర్లను వినియోగించే వారికి సరఫరా చేస్తుండడంతో వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లలో యథేచ్ఛగా గ్యాస్ సిలిండర్లను ఎక్కువ డబ్బుకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నా పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ బ్లాక్ దందాపై ఫిర్యాదులు అందినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో అటు గ్యాస్‌ను ఇళ్లకు చేరవేసే డెలివరీ బాయిస్‌తో పాటు అక్రమ వ్యాపారాలు చేసే వారు మరింత శృతిమించుతున్నారు.

వినియోగదారుల ఇబ్బందులు..

వినియోగదారులకు సౌకర్యంగా ఉండేలా గ్యాస్ సంస్థలు గ్యాస్‌కు లింకై ఉన్న ఫోన్ నంబర్లకు బుక్ చేసినప్పటి నుంచి డెలివరీ అయ్యే వరకు మెసేజ్‌ల ద్వారా సందేశాలను పంపిస్తుంది. ఖైరతాబాద్‌లో ఎక్కువగా ఇండేన్‌తో పాటు హెచ్‌పి, భారత్ గ్యాస్ కంపనీలు ఎక్కువ వినియోగదారులను కలిగిఉన్నాయి. ఖైరతాబాద్‌లో జీఎస్‌ఎస్ డిస్ట్రిబ్యూటర్ కిందకు వచ్చే పరిధిలో ఇండేన్ గ్యాస్ వినియోగదారులకు డెలివరీ బాయిస్ చుక్కలు చూపిస్తున్నారు. గ్యాస్ బుక్ చేసినప్పుడు ఆర్డర్ రిజిస్టర్ అయినట్లు ఫోన్లకు సందేశం వస్తోంది. అనంతరం ఇన్వాయిస్ జనరేట్ అయినట్లు, తర్వాత డీఏసీ నంబరుతో పాటు డెలివరీ అయినట్లు వినియోగదారుల ఫోన్లకు సందేశాలు వస్తున్నా, గ్యాస్ సిలిండర్లు మాత్రం అందడంలేదని ఎంతో మంది ఫిర్యాదు చేస్తున్నారు. పలుమార్లు గ్యాస్ కంపనీ కార్యాలయాలకు, డెలివరీ బాయిస్‌కు ఫిర్యాదు చేస్తే తప్ప గ్యాస్ సిలిండర్లు డెలివరీ కావడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. గట్టిగా మందలిస్తే తిరిగి మరోసారి గ్యాస్ బుక్ చేయించి మరుసటి రోజు డెలివరీ ఇస్తున్నారని, దీంతో 15 నుంచి 20 రోజుల్లో 2 సార్లు గ్యాస్ బుక్ చేయాల్సి వస్తోందని, డెలివరీ మాత్రం ఒకసారే అవుతుందని ఇండేన్ గ్యాస్ వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

రిపేర్ల ముసుగులో గ్యాస్ అమ్మకాలు..

కొందరు గ్యాస్ స్టవ్‌లు, కుక్కర్లు, మిక్సీలు రిపేర్ చేస్తామనే బోర్డులతో దుకాణాలను నడిపిస్తూ అక్రమంగా గ్యాస్ సిలిండర్లతో పాటు రీఫిల్లింగ్ చేస్తున్నారు. పలు కంపనీలకు చెందిన డెలివరీ బాయిస్‌తో పాటు గ్యాస్ కంపనీల కార్యాలయ ఉద్యోగులతో కుమ్మక్కై ఖైరతాబాద్‌లో బహిరంగంగా గ్యాస్ సిలిండర్లను విక్రయిస్తున్నారు. లక్ష్మీనగర్‌లో ఓ వ్యాపారి దుకాణాన్ని తెరవకుండా కేవలం గోదాంలా మార్చుకొని వినియోగదారులు వస్తే 850 రూపాయల్లో లభించే గ్యాస్ సిలిండర్‌ను 1300 నుంచి 1500ల రూపాయలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. గ్యాస్ సిలిండర్లు ఇతగాడికి పలు కంపనీలవారు చేరవేస్తున్నట్లు సమాచారం. 5 కెజీల గ్యాస్ సిలిండర్‌లో 3 నుంచి 4 కిలోల గ్యాస్‌ను అక్రమంగా నింపుతూ 300 రూపాయలు వసూలు చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

గ్యాస్ సిలిండర్లు సకాలంలో అందడం లేదని, వినియోగదారులు పలు మార్లు గ్యాస్ కంపనీలకు, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బహిరంగ మార్కెట్లలో గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను విక్రయిస్తున్నా, చిన్న గ్యాస్ బుడ్డీలలో గ్యాస్‌ను రీఫిల్లింగ్ చేసి అమ్ముతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదు చేసేందుకు సంబంధిత అధికారులకు ఫోన్ చేస్తే సరైన స్పందన లేకపోగా కించపరచినట్లు మాట్లాడుతుండడంపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు విచారించాలి. ఇప్పటికైనా గ్యాస్ కంపనీలు, పౌర సరఫరాల శాఖ అధికారులు చొరవ తీసుకొని వినియోగదారులకు సరైన సమయంలో సిలిండర్లను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి.



లంకల దీపక్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి వెళ్తున్న రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు బంగారు ప్రశాంత్, తదితరులు

కష్టపడి పనిచేస్తే బీజేపీలో తగిన గుర్తింపు

● బంగారు ప్రశాంత్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసే కార్యకర్తకు బీజేపీలో తగిన గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు బంగారు ప్రశాంత్ అన్నారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన లంకల దీపక్‌రెడ్డి ప్రమాణస్వీకారం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి బంజారాహిల్స్ బంజారా ఫంక్షన్ హాల్ నుంచి పలు నియోజకవర్గాలకు చెందిన నాయకులు తరలివచ్చి బంగారు ప్రశాంత్ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీని పటిష్ట పరిచేందుకు అధిష్ఠానం కొత్త నాయకత్వానికి బాధ్యతలు అప్పగిస్తుందన్నారు. పార్టీ శ్రేణులంతా కలిసి కట్టుగా పనిచేసి రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం లంకల దీపక్‌రెడ్డిని కలిసి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, మోహన్ కొల్లూరు, పవన్‌కుమార్, గడ్డం వెంకటస్వామి, భుజేంద్రకుమార్, ప్రేమ్‌రాజ్, రవి, క్రాంతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



వరలక్ష్మికి నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా వరలక్ష్మి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా స్వామి వివేకానందనగర్ బస్తీకి చెందిన వరలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు గాంధీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు వరలక్ష్మికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మరోసారి అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు సునీతారావుకు, ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు, డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డికి, టీపీసీసీ కార్యదర్శి విజయారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రచారం చేయడంతో పాటు పార్టీని బలపరిచే విధంగా తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కృషి చేస్తానని అన్నారు.



హనుమత్ వైభవ ఉత్సావాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెంకటరమణ, అర్చకులు

హనుమత్ వైభవ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పంజాగుట్ట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ హెచ్-బ్లాక్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు మూడు రోజుల పాటు మాఘమాస హనుమత్ వైభవ ఉత్సావాలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు తోటకూర నరసింహారావు, తోటకూర వెంకటరమణలు తెలిపారు. ఆదివారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు పవన్ కుమార్ స్వామి, వీరేశం శర్మ, మహేష్ స్వామి, సత్యం బాబు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో చదువుతున్న షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కోటాజీ ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది 23,941 దరఖాస్తులు రాగా.. ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటి వరకు 17,854 మాత్రమే వచ్చాయన్నారు. మార్చి 31 వరకు చివరి గడువు ఉన్నందున 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులు, యాజమాన్యాలు https://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

టాటా ఏస్ వాహనం స్వల్పంగా దగ్ధం

బోరబండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు చేసిన పనికి కార్మికనగర్ చౌరస్తాలో పార్కింగ్ చేసిన టాటా ఏస్ వాహనం స్వల్పంగా దగ్ధమైంది. స్థానికులు గమనించి అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి మంటలను ఆర్పారు. దీంతో ఎపి11వై0170 టాటా ఏస్ వాహనం స్వల్పంగా ముందు భాగం దగ్ధమయింది.

మద్యం మత్తులో గొడవ

● ఆపేందుకు వెళ్లిన కానిస్టేబుల్ సెల్‌ఫోన్ లాక్కొని దాడి



కుంభాల సాయి తేజ, జంగం చల్లారావు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ఇద్దరు యువకులుమద్యం తాగి నడి రోడ్డు మీద గొడవకు దిగారు. అదే దారిలో వెళ్తున్న టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ ఆపేందుకు ప్రయత్నించాడు. కాని ఇద్దరు యువకులు కానిస్టేబుల్‌కు ఎదురు తిరిగి సెల్‌ఫోన్ లాక్కున్నారు. అంతే కాకుండా అతనిపై దాడి చేసి గాయపర్చారు. శ్రీకృష్ణనగర్‌కు చెందిన టి. ఈశ్వర్‌రావు టాస్క్‌ఫోర్స్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 8న రాత్రి విధులు ముగించుకొని ఇంటికి బయలు దేరాడు. ఇంటి సమీపంలోకి రాగానే నడి రోడ్డుమీద యువకులు గొడవ పడుటం గమనించాడు. వెంటనే వారిని ఆపేందుకు ప్రయత్నించాడు. ఇద్దరు యువకులు అతన్ని పట్టించుకోకుండా దుర్భషలాడారు. తాను పోలీసునని చెప్పి నా వినిపించుకోకుండా ఈశ్వర్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో ఈశ్వర్ పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు సెల్‌ఫోన్ తీయగా యువకులు ఫోన్ లాక్కొని ఈశ్వర్‌పై దాడి చేశారు. గాయపడ్డ ఈశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. బీజేపీ జూబ్లీహిల్స్ అసెంబ్లీ కన్వీనర్ కుంభాల గంగరాజు కుమారుడు కుంభాల సాయి తేజ, జంగం చల్లారావు నిందితులుగా గుర్తించారు. వారిద్దరిని అరెస్టు చేశారు.

ఆహార అలవాట్లు మార్చుకోవాలి

●రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ఆర్థో వాక్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, తదితరులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నేటి కాలంలో చిన్నతనంలోనే కీళ్ల, ఎముకల సమస్యలకు గురవుతున్నారని ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, ప్రతిరోజూ వ్యాయామాలతో వీటిని దూరం చేసుకోవచ్చునని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. కీళ్ల, ఎముకల సమస్యలపై అవగాహన కల్పిస్తూ మునాట్ హెల్త్ కేర్ ఫౌండేషన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాల సంయుక్త ఆధ్వర్యంలో పీవీ మార్గంలోని జలవిహార్ నుంచి 3,5,7 కిలో మీటర్ల ఆర్థోపెడిక్ వాకథాన్ జరిగింది. దీనిని ప్రభుత్వ ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ రవికుమార్ వర్మలతో కలిసి మంత్రి ప్రారంభించారు. యువత యోగాతో పాటు ప్రతి రోజూ నడక, వ్యాయామం చేసి శారీరకంగా ఫిట్‌గా ఉండాలని కోరారు. ఇందులో మునాట్ ఫౌండేషన్ డైరెక్టర్లు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ శిల్ప మునాట్, సామాజిక వేత్తలు సుశీల్ కపాడియా, వినోద్ సంచేటి తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సౌజన్యమూర్తి రమణాచారి

● కొమండూరి రామాచారికి
వంశీ-కేవీ.రమణ గ్లోబల్ మ్యూజిక్ అవార్డు ప్రదానం



రామాచారిని సత్కరిస్తున్న విద్యాసాగర్ తదితరులు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల మన్ననలు అందుకున్న కేవీ.రమణాచారి సాంస్కృతిక సౌజన్యమూర్తి అని, ఈతరం అధికారులకు ఆదర్శమూర్తిని మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో వంశీ ఆర్ట్ థియేటర్స్, వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ డా.కేవీ.రమణాచారి జన్మదిన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు కొమండూరి రామాచారికి వంశీ కేవీ.రమణ గ్లోబల్ మ్యూజిక్ అవార్డు 2025ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విద్యాసాగర్‌రావు పురస్కారగ్రహీత రామాచారిని సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణలో రమణాచారి పాత్ర కీలకంగా ఉందన్నారు. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య ఎన్.గోపి మాట్లాడుతూ కళాపోషణలో రమణాచారి నిత్యం ముందుంటారని అన్నారు. ఈతరం పిల్లలకు సంగీతంలో శిక్షణ ఇస్తున్న రామాచారికి వంశీ రమణ పురస్కారం అందజేయడం సముచితమైన నిర్ణయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లినేని కృష్ణయ్య, డా.కేవీ.రమణాచారి, రేలంగి నరసింహారావు, దైవజ్ఞశర్మ, వంశీరామరాజు తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఖాళీగా ఉన్న 37 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి

ఎంపీ ఆర్.కృష్ణయ్య



ప్రభుత్వానికి పీఈటీల కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25 వేల టీచర్ పోస్టులను, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో 12 వేల గురుకుల టీచర్ పోస్టులను వెంటనే భర్తీచేయాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ సంక్షేమ గురుకుల స్కూల్స్ వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వానికి పీఈటీల కృతజ్ఞత సభలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 1,600 పీఈటీ పోస్టులను వెంటనే భర్తీచేయాలన్నారు. నల్గొండ, వరంగల్, ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్యను, గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నిరుద్యోగ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మాదగోని సైదులుగౌడ్ అధ్యక్షత వహించగా జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, రాష్ట్ర జూనియర్ ఫిజికల్ డైరెక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.లక్ష్మయ్య, ప్రధానకార్యదర్శి పర్వతాలుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

10 కిలోల గంజాయి పట్టివేత

● ఇద్దరు డ్రైవర్ల అరెస్ట్..
● పరారీలో ప్రధాన సూత్రధారి



స్వాధీనం చేసుకున్న గంజాయి, కారును చూపుతున్న ఎక్సైజ్ పోలీసుల బృందం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని అరకు నుంచి నగరానికి గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు డ్రైవర్లను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని హెచ్‌ఎంటీ సంస్థలో ఉద్యోగి ప్రవీణ్ వర్మ, వచ్చే ఆదాయం విలాసాలకు సరిపోకపోవడంతో గంజాయి దందా మొదలు పెట్టాడు. ప్రవీణ్ వర్మ జూమ్ యాప్‌లో కారును బుక్ చేసుకుని డ్రైవర్‌తో కలిసి ఒడిశా బోర్డర్ వెళ్లాడు. అక్కడ 10 కిలోల గంజాయిని కొనుగోలు చేసి ఎవరికీ అనుమానం రాకుండా కారు అరల్లో, బ్యానెట్లలో గంజాయిని దాచి నగరానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో మరో డ్రైవర్‌ను పిలిపించి సదరు కారులో పంపించాడు. తాను మరో కారులో నగరానికి చేరుకున్నాడు. గంజాయి తరలిస్తున్న కారు సికింద్రాబాద్ నుంచి అల్వాల్ వైపునకు వస్తున్న క్రమంలో ఎక్సైజ్ పోలీసుల బృందం తనిఖీలు చేసింది. డోర్‌తోపాటు బానెట్‌లో దాచిన 10కిలోల గంజాయిని, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లు తంగెళ్ల శేఖర్, పి.అనిల్ కుమార్‌లను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు ప్రవీణ్ వర్మ పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

'ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి'



అజహరుద్దీన్‌ను కలిసిన కార్పొరేటర్ బాబా

బోరబండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని టీపీసీసీ వర్కింగ్ పెసిడెంట్, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి మహ్మద్ అజహరుద్దీన్ అన్నారు. ఆదివారం బోరబండ కార్పొరేటర్ బాబాఫసియుద్దీన్ ఆయనను కలిశారు.

ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజాపాలన సేవా కేంద్రాల పనితీరు, పార్టీ సంస్థ గత అంశాలను చర్చించాలమని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ తెలిపారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పంజాగుట్ట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సమైక్య భారతి యూత్ అసోసియేషన్, నవ్యశ్రీ సామాజిక సేవా సమితిల ఆధ్వర్యంలో ఆసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ, క్లోవి డెంటల్ ఆస్పత్రుల సహకారంతో ఆదివారం తుమ్మలబస్తీలోని సమైక్య భవన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర కుమార్, ఖైరతాబాద్ పీఎస్ ఎస్‌ఐ నాగరాజులు ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు, సిబ్బంది పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా లంకల దీపక్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఖైరతాబాద్ నాయకులు ఆదర్శ్, ప్రేంరాజ్, నగేష్, రామ్మోహన్‌రావు, వీణామాధురి తదితరులు

-ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి

సెలూన్స్ చైర్స్ కంపెనీలో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం మధ్యాహ్నం కాటేదాన్‌లో గల రింకూ జైన్‌కు చెందిన ఆర్‌కే బ్యూటీ కాన్సెప్ట్ సెలూన్స్ చైర్స్ కంపెనీలో అగ్నిప్రమాదం సంభవించింది. గోదాములో పనిచేస్తున్న వాచ్‌మ్యాన్ మధ్యాహ్నం టీ చేసుకుంటుండగా విద్యుత్ ఓవర్‌లోడై, షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలొచ్చాయి. దీంతో వాచ్‌మ్యాన్ బయటకు పరుగులు తీశాడు. మంటలు పెద్దఎత్తున ఎగిసి పడ్డాయి. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేయగా రాజేంద్రనగర్ అగ్ని మాపక శాఖ ఫైర్ ఆఫీసర్ చంద్రనాయక్ వెంటనే ఫైర్ ఇంజన్‌తో సంఘటనా స్థలానికి వచ్చారు. మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. మంటలు తీవ్రస్థాయిలో ఉండటంతో చందులాల్ బారాదారి, లంగర్‌హౌజ్, చాంద్రాయణగుట్ట ప్రాంతాలకు చెందిన ఐదు ఫైర్ ఇంజన్‌లను తెప్పించి, మంటలను ఆర్పివేశారు. మంటలను ఆర్పడానికి మైలార్‌దేవుపల్లి వాటర్ వర్క్స్ నుంచి మంచినీటి ట్యాంకర్‌లను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు వరకు మంటలు ఎగిసిపడుతూనే ఉన్నాయి. కేసును మైలార్‌దేవుపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మాదాపూర్‌లోని మెరిడియన్ స్కూల్‌లో ఆదివారం జరిగిన మెరివాగంజా-2025 కార్నివాల్‌లో విద్యార్థులు రోజంతా ఆట పాటలతో సరదాగా గడిపారు. ఫ్లాష్ మాబ్ కార్యక్రమాలతో పాటు సవారీలు, ఇంటరాక్టివ్ బోర్డు ఆటలు, లక్కీ డ్రాలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు ప్రిన్సిపాల్ కరణం భవాని, విద్యా సంస్థల ఫౌండర్ బుట్టా రేణుక తెలిపారు.

- బంజారాహిల్స్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి)

కారు అద్దాలకు బ్లాక్‌ఫిలిం పెడితే కఠిన చర్యలు


కారు అద్దాలకు ఉన్న బ్లాక్‌ఫిలిం తొలగిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

బౌద్ధనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కారు అద్దాలకు బ్లాక్‌ఫిలిం అతికిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిలకలగూడ పోలీస్‌స్టేషన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం చిలకలగూడ చౌరస్తాలో నిర్వహించిన తనిఖీల్లో పలుకార్లకు అతికించిన బ్లాక్‌ఫిలింలను తొలగించి వారికి చలాన్లు విధించారు. చాలా మంది ట్రాఫిక్ నిబంధనలను ఉల్లఘిస్తున్నారని అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

మధురానగర్‌కాలనీ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

బౌద్ధనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లోని మధురానగర్‌కాలనీ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికైంది. ఆదివారం మధురానగర్‌కాలనీలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మూజువాణి ఓటుతో నూతన పాలక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్.బ్రహ్మచారి, ఉపాధ్యక్షులుగా ఈశ్వరయ్య, ఎ.శ్రీధర్, ప్రధానకార్యదర్శిగా ఎ.రాజుసాగర్, ఉపకార్యదర్శులుగా బి.ఎల్లయ్యగౌడ్, టి.భానుప్రసాద్, వ్యవస్థాగత కార్యదర్శిగా ఎ.ప్రవీణ్, కోశాధికారిగా సిహెచ్.మహేశ్‌కుమార్‌లు నియామితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధురానగర్‌కాలనీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. కాలనీలో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు వద్దకు తీసుకువెళ్లి వాటిని పరిష్కారించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.


మహిళా క్రికెటర్ గొంగడి త్రిషను సత్కారిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మహిళా క్రికెటర్ గొంగడి త్రిషకు సత్కారం

బౌద్ధనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరల్డ్ కప్ అండర్-19 టీ20 లో సత్తాచాటిన తెలుగుతేజం మహిళ క్రికెటర్ గొంగడి త్రిషను ఆదివారం సికింద్రాబాద్ నియోజకవర్గ నాయకులు సత్కారించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాదిరెడ్డి జలందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు వినోద్, ఎంఎన్.కుమార్, ప్రతాప్, అశోక్‌కుమార్, శంకర్, ప్రవీణ్, వేణు తదితరులు మారేడుపల్లిలో నివాసంలో గొంగడి త్రిషను కలిసి శాలువా కప్పి, పూలబొకేలు అందజేసి ఘనంగా సత్కారించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పంజాగుట్ట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సమైక్య భారతి యూత్ అసోసియేషన్, నవ్యశ్రీ సామాజిక సేవా సమితిల ఆధ్వర్యంలో ఆసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ, క్లోవి డెంటల్ ఆస్పత్రుల సహకారంతో ఆదివారం తుమ్మలబస్తీలోని సమైక్య భవన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర కుమార్, ఖైరతాబాద్ పీఎస్ ఎస్ఐ నాగరాజులు ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు, సిబ్బంది పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు.

కీసర గుట్టలో మౌలిక సదుపాయాలకు కృషి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): శివరాత్రికి కీసర గుట్టలో మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై తమిళ సోదరులను మల్కాజిగిరి జిల్లాకలెక్టర్ వద్దకు తీసుకెళుతానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేను తమిళ సోదరులు కలిసి విన్నవించారు. ఈ సందర్భందగా తమిళ సోదరులు మాట్లాడుతూ శివరాత్రికి ప్రసిద్ధి చెందిన కీసరగుట్టకు ఎన్నో ఏళ్లుగా హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న తమిళ సోదరులు జాతరకు వారం రోజుల పాటు ప్రత్యేక పూజలు చేసుకుంటామని, ప్రభుత్వం ఆలయ కమిటీ అధికారులు కేవలం రెండు రోజుల మాత్రమే భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తాగునీరు మరుగొడ్లు తదిత మౌలిక సదుపాయాలు వారం రోజుల పాటు కల్పించేలా అధికారులతో మాట్లాడాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే తమిళ సోదరులతో కలిసి మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళుతానని హామీ ఇచ్చారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మారేడుపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియన 50 సంవత్సరాల వ్యక్తి మృతి చెందిన సంఘటన మారేడుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ అక్షీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. జనవరి 19 తేదిన జూబ్లీ బస్ స్టేషన్ ప్రాంగణంలోని ప్లాట్‌ఫామ్ నంబర్ 22 వద్ద 50 సంవత్సరాల గుర్తు తెలియన వ్యక్తి స్పృహ కోల్పోయి ఉన్నాడని సమాచారం అందుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాల కోసం మారేడుపల్లి పోలీసులను సంప్రదించాలని వారు కోరారు.

సొంత ఐడీతో రైల్వే ఈ టికెట్ల విక్రయాలు

- వ్యక్తి అరెస్టు.. రైల్వే టికెట్లు స్వాధీనం


ఆర్పీఎఫ్ పోలీసుల అదుపులో రైల్వే టికెట్లను విక్రయిస్తున్న వ్యక్తి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సొంత ఐఆర్‌సీటీసీ ఐడీతో రైల్వే టికెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం.. హుమాయినగర్, ఆసీఫ్‌నగర్‌కు చెందిన మహ్మద్ నాజీర్ హుస్సేన్(28) కొంత కాలంగా గుట్టు చప్పుడు గాకుండా ఇంట్లోనే సొంత ఐఆర్‌సీటీసీ ద్వారా రైల్వే ఆదాయానికి గండికొడుతు ఈ రైల్వే టికెట్లను విక్రయిస్తున్నాడని విశ్వసీయ సమాచారం అందుకున్న నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులు ఇతని ఇంటిపై తనిఖీలు చేశారు. ఐఆర్‌సీటీసీ ఈ టికెట్లను సొంత ఐడీతో ఒక్కొక్క టికెట్‌కు అదనంగా రూ. 100 వసూలు చేస్తూ రైల్వే ఆదాయానికి గండికొడుతున్నాడు. ఇతనీ నుంచి మూడు టికెట్లను సీజ్ చేయగా గతంలో 11 ఈటికెట్లను విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది. సొంతగా ఆరు ఐడీలను క్రియేట్ చేసి ప్రయాణికుల వద్ద నుంచి అదనంగా వసూలు చేస్తున్నాడని సీఐ తెలిపారు. నిందితుడి నుంచి సొంత ఐడీ సీజ్ చేసి ఈ టికెట్లు, ఆధార్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

చిలకలగూడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) మెట్టుగూడ వై జంక్షన్ వద్ద డ్రైనేజీ పొంగుతున్నది అని ఆదివారు ఫిర్యాదు అందటంతో కార్పోరేటర్ రాసూరి సునీత వెంటనే అక్కడికి వెళ్లి సమస్య అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. తరచు డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలపడంతో అధికారులతో మాట్లాడి సమస్య శాశ్వతంగా ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.


భోదనలు చేస్తున్న బౌద్ధ భిక్షువులు


ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న బౌద్ధ భిక్షువులు, గురువులు

ఘనంగా తిపిటక సద్ధమ్మ సజ్ఞాయాన

మహేంద్ర హిల్స్‌లోని మహాబోధి బుద్ధవిహార్‌లో నిర్వహణ

- హాజరైన దేశ విదేశాల బౌద్ధ భిక్షువులు, గురువులు


బుద్ధ విహార్‌లోని బుద్ధుడి విగ్రహం ఎదుట ప్రవచనాలు చేస్తున్న భిక్షువులు

మారేడుపల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి సారిగా తిపిటక సద్ధమ్మ సజ్ఞాయాన కార్యక్రమం ఆదివారం సికింద్రాబాద్ మహేంద్ర హిల్స్‌లోని మహాబోధి బుద్ధ విహార్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేశ విదేశాలకు చెందిన 150 మంది బౌద్ధ భిక్షువులు, గురువులు, ఉపాసకులు, దీక్ష ప్రవర్తకులు పాల్గొని వారి సందేశాలను బుద్ధుని మార్గ దర్శకాలను విశదీకరించారు. బుద్ధుడి బోధనలు, ప్రవచనాలు ప్రజలకు వివరించిన పలు అంశాలను తిపిటక అనే (పాళీ భాషలో బుద్ధుని సొంత మాటలను పాటించడం) గ్రంథంలో పొందుపర్చిన అంశాలను ఆహ్వానితులకు బోధించారు. మహాబోధిని సందేశాలు, సత్యమార్గంలో నడవడం, అబద్ధం ఆడకుండా జీవనం చేయడం, పరోపకారం, మనిషికి మనిషి గౌరవించుకోవడం, సమాజంలో అందరూ గౌరవంగా జీవించడం, సంప్రదాయాలు, విలువలను పాటిస్తూ బౌద్ధ ఆశయాలు ఏ విధంగా ఆచరించాలో వివరించారు. మహాబోధి సొసైటీ హైదరాబాద్, ఎల్‌బీడీఎఫ్ఐ, ఛాంటింగ్ కౌన్సిల్ తెలంగణ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మొదటిసారిగా దక్షిణాదిలో అతి పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా ముఖమైన ప్రదేశాలలో భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. అంతకు ముందు వివిధ దేశాలనుంచి విచ్చేసిన బౌద్ధ భిక్షువులు ధర్మచక్ర, బుద్ధవృక్షం ముందు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో బుద్ధవిహార్ ప్రాంతమంతా ఆధ్యాత్మికతన సంతరించుకుంది. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖ భిక్షువులు, గురువులతో పాటు నిర్వాహకుడు బుద్ధిపాల తదితరులు పాల్గొన్నారు.

బీసీల్లో పద్మశాలి కులాన్ని తక్కువచేసి చూపించారు

బౌద్ధనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేలో పద్మశాలి కులాన్ని తక్కువ చేసి చూపించారని గ్రేటర్ వారాసిగూడ పద్మశాలి సంఘం నాయకులు ధ్వజమెత్తారు. ఆదివారం వారాసిగూడ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి సర్వేలో బీసీల్లో పద్మశాలి కులస్తులను మూడవ స్థానం ఉండేదని, ఈ ప్రభుత్వం ఐదవ స్థానంలో తీసుకువచ్చిందన్నారు. పట్టు, శాలి, తొగట, దేవాంగ, పద్మశాలితో పాటు ఉపకులాలు కలిసి 11.79 లక్షల జనాభాలో 3.3శాతం ఉన్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం మరోసారి సర్వేను నిర్వహించాలని కోరారు. సమావేశంలో వారాసిగూడ పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొమ్మ నరేందర్, కడియాల బలరామ్, జనార్థన్, రాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార అలవాట్లు మార్చుకోవాలి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నేటి కాలంలో చిన్నతనంలోనే కీళ్ల, ఎముకల సమస్యలకు గురవుతున్నారని ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, ప్రతిరోజూ వ్యాయామాలతో వీటిని దూరం చేసుకోవచ్చునని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. కీళ్ల, ఎముకల సమస్యలపై అవగాహన కల్పిస్తూ మునాట్ హెల్త్ కేర్ ఫౌండేషన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాల సంయుక్త ఆధ్వర్యంలో పీవీ మార్గంలోని జలవిహార్ నుంచి 3,5,7 కిలో మీటర్ల ఆర్థోపెడిక్ వాకథాన్ జరిగింది. దీనిని ప్రభుత్వ ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ రవికుమార్ వర్మలతో కలిసి మంత్రి ప్రారంభించారు. యువత యోగాతో పాటు ప్రతిరోజూ నడక, వ్యాయామం చేసి శారీరకంగా ఫిట్‌గా ఉండాలని కోరారు. ఇందులో మునాట్ ఫౌండేషన్ డైరెక్టర్లు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ శిల్ప మునాట్, సామాజిక వేత్తలు సుశీల్ కపాడియా, వినోద్ సంచేటి తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు



విద్యార్థులు తయారుచేసిన పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, పాండుయాదవ్

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో నేర్చుకున్న విజ్ఞానాన్ని ఉపయోగించి విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధన, ప్రాజెక్టులను రూపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు వేదికలుగా నిలుస్తాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. బోయిన్‌పల్లిలోని గణేష్‌నగర్ కంటోన్మెంట్ ఆరవ వార్డులోని వాణి కాన్వెంట్‌లో మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు 6వ వార్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల వాణి, కరస్పాండెంట్ శ్రీనివాస్‌లతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల అద్భుత ఆవిష్కరణలు ప్రాజెక్టులను వారు తిలకిస్తూ ఆయా నమూనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆసక్తిగల విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తే అద్భుత ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు బానుక మల్లికార్జున్, రాయల్ కుమార్, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు ప్రభాకర్, సాయి శరత్, పాఠశాల యాజమాన్యం సభ్యులు ఉత్తేజ్, శ్రీనికేత్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రష్మిత రాజ్, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ప్రోగ్రాంకు తక్షశిలపబ్లిక్ స్కూల్ ఎంపిక



ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి పాఠశాల యాజమాన్యం, కల్నల్ రాకేష్ కుమార్ తదితరులు

తార్నాక, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): లాలాపేటలోని తక్షశిల పబ్లిక్ స్కూల్ తెలంగాణలోని 5వ బెటాలియన్ కింద నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) ప్రోగ్రాంకు ఎంపిక కావడంపై పాఠశాల ప్రిన్సిపాల్ తనుప్రీత్ కౌర్ హర్షం వ్యక్తం చేశారు. తక్షశిల పబ్లిక్ స్కూల్ ఎన్‌సీసీ కార్యక్రమానికి ఎంపికైన నేపథ్యంలో ఆదివారం లాలాపేటలోని పాఠశాల ఆవరణలో తెలంగాణ 5వ బెటాలియన్ సీఓ కల్నల్ రాకేష్ కుమార్ పాఠశాల యాజమాన్యంతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, గ్రూప్ కమాండర్ కల్నల్ అనిల్ యాదవ్ అంకిత భావం వల్లే తమ పాఠశాల ఈ మైలురాయిని సాధించిందని అన్నారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో శారీరక ధృడత్వంతో పాటు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అభిప్రాయపడ్డారు.

- **బీజేపీ శ్రేణుల సంబరాలు..**



డిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భారీ ఆధిక్యంతో గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు బండారి ఉపేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం తార్నాక చౌరాస్తాలో సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్ గౌడ్, వీరన్న, రాముదర్మ, పోచయ్య యాదవ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. - తార్నాక, ఆంధ్రజ్యోతి

10 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు డ్రైవర్ల అరెస్ట్..
- పరారీలో ప్రధాన సూత్రధారి


స్వాధీనం చేసుకున్న గంజాయి, కారును చూపుతున్న ఎక్సైజ్ పోలీసుల బృందం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని అరకు నుంచి నగరానికి గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు డ్రైవర్లను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని హెచ్ఎంటీ సంస్థలో ఉద్యోగి ప్రవీణ్ వర్మ, వచ్చే ఆదాయం విలాసాలకు సరిపోకపోవడంతో గంజాయి దందా మొదలు పెట్టాడు. ప్రవీణ్ వర్మ జూమ్ యాప్‌లో కారును బుక్ చేసుకుని డ్రైవర్‌తో కలిసి ఒడిశా బోర్డర్ వెళ్లాడు. అక్కడ 10 కిలోల గంజాయిని కొనుగోలు చేసి ఎవరికీ అనుమానం రాకుండా కారు అరల్లో, బ్యానెట్లలో గంజాయిని దాచి నగరానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో మరో డ్రైవర్‌ను పిలిపించి సదరు కారులో పంపించాడు. తాను మరో కారులో నగరానికి చేరుకున్నాడు. గంజాయి తరలిస్తున్న కారు సికింద్రాబాద్ నుంచి అల్వాల్ వైపునకు వస్తున్న క్రమంలో ఎక్సైజ్ పోలీసుల బృందం తనిఖీలు చేసింది. డోర్‌తోపాటు బానెట్‌లో దాచిన 10కిలోల గంజాయిని, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లు తంగెళ్ల శేఖర్, పి.అనిల్ కుమార్‌లను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు ప్రవీణ్ వర్మ పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

డీఈఈ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవీందర్ నాయక్



రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డీఈఈ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవీందర్ నాయక్‌ని ఎన్నుకున్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని ఓ హోటల్ జరిగిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ కార్యదర్శిగా సిహెచ్ భగవంతరావు, కోశాధికారిగా కాశీనాథ్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రవీందర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని గృహ నిర్మాణ సంస్థలో పనిచేస్తున్న డీఈల సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న డీఈలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటి స్థలం, నష్ట పరిహారం ఇవ్వాలి


ధర్నా చేస్తున్న నిర్వాసితులు

తిరుమలగిరి ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎలివేటెడ్ కారిడోర్ నిర్మాణంలో భాగంగా నివాసాలు కోల్పోతున్న తమకు భూమితో పాటు ఇంటి నిర్మాణ నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేస్తూ బొల్లారం నుంచి లక్డావాలా బస్టాప్ వరకు ఆదివారం శాంతియుత ర్యాలీ చేపట్టారు. కంటోన్మెంట్ బొల్లారంలోని బి3 ప్రాంతాల్లో నివాసం ఉంటున్న తమకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన నష్టపరిహారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. మూడు తరాలుగా కుటుంబాలతో ఇక్కడే నివసిస్తూ జీవనం కొనసాగిస్తున్నామని స్థానికులు తెలిపారు. కంటోన్మెంట్‌లోని ఇతర ప్రాంతాలలో భూమితో పాటు నిర్మాణానికి కూడా నష్టపరిహారాన్ని అందిస్తున్నారని, తమకు కేవలం నిర్మాణానికి నష్టపరిహారం అందిస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కంటోన్మెంట్ వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించారని, బొల్లారంలో గ్రామసభ నిర్వహించి తమ అభిప్రాయాలు తీసుకుంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా తమ సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ అధికారులు న్యాయం చేయాలని తగిన నష్టపరిహారాన్ని అందించాలని కోరారు. పేద మధ్యతరగతి వర్గాలకు చెందిన తమను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో శ్రీహరి, మదన్ మోహన్, విశాల్ ఆనంద్, ప్రమోద్, ప్రీతం, సిసిలియా, మేరీ విక్టోరియా, విశాల్ కుమార్, హరినాథ్, శంకర్ రావులు పాల్గొన్నారు.


చిలకలగూడ దూద్‌బావిలో ఆదివారం హోసన్న పెంతకోస్తు చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజక వర్గం ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్‌ని సత్కరిస్తున్న చర్చి ప్రతినిధులు. - చిలకలగూడ, ఆంధ్రజ్యోతి


బన్సీలాల్‌పేట డివిజన్ జైప్రకాష్ నగర్‌లో ఆదివారం నిర్వహించిన గ్యార్వీ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్, కార్పొరేటర్ హేమలత తదితరులు. - పద్మారావునగర్, ఆంధ్రజ్యోతి